క్లుప్తంగా

ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలి

కర్నూలు(న్యూసిటీ):కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలని టీఎస్ఎస్ఎఫ్ కర్నూలు పార్లమెంట్ జనరల్ సెక్రటరీ బొగ్గుల ప్రవీణ్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు ఫీజు వివరాలు నోటీసు బోర్డులో ఉంచడం లేదన్నారు. కండీషన్‌లో లేని బస్సులను నడుపుతూ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారన్నారు. పుస్తకాలు, యూనిఫాం అధిక ధరకు అంటగడుతూ విద్యాసంస్థలు వ్యాపార కేంద్రాలను తలపిస్తున్నాయన్నారు. ఇలాంటి వాటిని సీజ్ చేయాలని కోరారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలి



ఎస్ఈ నాగరాజుకు వినతిపత్రం ఇస్తున్న ఆర్‌వీపీఎస్ నాయకులు

కర్నూలు (న్యూసిటీ): మండలంలోని రేమట గ్రామానికి రోడ్డు నిర్మాణం చేపట్టాలని రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్ కోరారు. బుధవారం ఆయన రోడ్డు భవనాల శాఖ కార్యాలయంలో ఎస్ఈ నాగరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. కర్నూలు నుంచి రేమట వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతిని గుంతలు ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారని, అత్యవసర సమయంలో సైతం అంబులెన్స్ వెళ్లడానికి కూడా వీల్లేకుండా ఉందని ఎస్ఈకి వివరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఆర్‌వీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అశోక్ ఉన్నారు.

సెక్యూరిటీ గార్డు కుటుంబాన్ని ఆదుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): స్థానిక పెద్దాస్పత్రిలో పనిచేస్తూ అనారోగ్యంతో మృతిచెందిన సెక్యూరిటీ గార్డు కుటుంబాన్ని ఆదుకోవాలని సీఐటీయూ నగర కార్యదర్శి ఎం.విజయ్, నాయకులు కె.రామకృష్ణ కోరారు. బుధవారం సెక్యూరిటీ గార్డు కుటుంబాన్ని వారు పరామర్శించారు. ఎక్స్‌పర్ట్ ఏజెన్సీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న సి.జనార్దన్‌రెడ్డి గత శుక్రవారం విధులు నిర్వహిస్తున్న సందర్భంగా బీపీ ఎక్కువై స్పృహ తప్పి పడిపోయాడని, అక్కడే ఉన్నవారు అతనిని ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా కోలుకోలేక బుధవారం మృతిచెందాడన్నారు. జనార్దన్‌రెడ్డి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

రేపు శాకాంబరీ మహోత్సవాలు

కర్నూలు కల్చరల్: స్థానిక ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో ఈనెల 14న ఆషాడ మాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని ఉదయం 11 గంటలకు శాకంబరీ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం బుధవారం తెలిపారు. లలితా సహస్రనామ పారాయణం, సామూహిక కుంకుమార్చన, భజన, సంకీర్తన, శ్రీదేవి ఖడ్గాల పదార్చన, రాత్రి 8 గంటలకు లలితా అమ్మవారికి సప్త మంగళ హారతులు, మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

విస్తృత తనిఖీలు



రైస్ దుకాణంలో తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్ పీవీఎం పరమేశ్వర కుమార్

కర్నూలు (న్యూసిటీ): నగరంలో పాత బస్టాండ్, మండి బజార్ చుట్టు పక్కల దుకాణాలను బుధవారం తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ పీవీఎం పరమేశ్వరకుమార్ తనిఖీ చేశారు. ఓ దుకాణంలో 25 కేజీల బియ్యం బస్తాలో 2 కేజీలు తూకం తక్కువ ఉండడంతో కేసు నమోదు చేసి రూ.20 వేల జరిమానా విధించారు. తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కింగ్ మార్కెట్‌లో తూకం కాటాలు, రాళ్లకు ముద్రలు వేసే కార్యక్రమం జరుగుతుందని వ్యాపారులు వినియోగించుకోవాలని ఇన్‌స్పెక్టర్ తెలియజేశారు.

'రవీంద్ర' విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న కరస్పాండెంట్ పీబీవీ సుబ్బయ్య

కర్నూలు సిటీ: ఎన్‌టీఆర్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా టీజీవీ కళాక్షేత్రంలోని నృత్య నీరాజనంలో పాల్గొని తమ స్కూల్ విద్యార్థి కె.లక్ష్మీప్రశాంతి ప్రతిభ కనబచిరినట్లు రవీంద్ర టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ పి.బి.వి సుబ్బయ్య తెలిపారు. బుధవారం స్కూల్‌లో విద్యార్థినిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శారద దేవి, హెచ్ఎం నాగేంద్ర, కో-ఆర్డినేటర్ అక్తర్ బేగం, తదితరులు పాల్గొన్నారు.

సురక్షతో ప్రజలకు మరింత చేరువ

● ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్



సర్టిఫికెట్ అందిస్తున్న కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు (టౌన్): జగనన్న సురక్ష సదస్సులతో ప్రభుత్వ పథకాలు ప్రజలకు మరింత చేరువ చేయడమే ప్రభుత్వ ధ్యేయమని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ తెలిపారు. బుధవారం స్థానిక 43 వ వార్డు పరిధిలోని 112వ సచివాలయంలో జగనన్న సురక్ష సదస్సు నిర్వహించి పలువురికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తున్నామన్నారు. స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల్లో సమస్యలకు పరిష్కారం కాని వారు ఎవరైనా ఉన్నా సురక్ష సదస్సుల దృష్టికి తీసుకురావాలన్నారు. అర్హులై ఉండి పథకాలు అందకున్నా తమ దృష్టికి తీసుకువస్తే కచ్చితంగా న్యాయం చేస్తామన్నారు. జనన, మరణ, ఆదాయ, కుల తదితర ధ్రువీకరణ పత్రాలు కూడా ఎలాంటి ఖర్చు లేకుండా అందజేస్తామన్నారు. ఈనెలాఖరు వరకు సురక్ష సదస్సులు జరుగుతాయని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, స్పెషల్ ఆఫీసర్లు, వైఎస్సీపీ నాయకులు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు

కర్నూలు(రాజ్‌విహార్): సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. బుధవారం సాయంత్రం ఆయన స్థానిక 12వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వడ్డెగేరి, బాపూజీ నగర్‌లో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పథకం కావాలంటే మండల, జిల్లా కేంద్రాల్లోని అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజల వద్దకే పథకాలు వస్తున్నాయని, ఇవి కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు నయీం, చాట్ల మేరి, వార్డు నాయకులు ఎజాజ్, నవీన్, హనీఫ్, షేక్షా, శ్రీను కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు ఉంటే నేరుగా కలవండి

కర్నూలు(రాజ్‌విహార్): ఏవైనా సమస్యలు ఉంటే తనను నేరుగా కలిసి విన్నవించుకోవచ్చని ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక పాతబస్తీలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురి నుంచి వినతిపత్రాలు స్వీకరించి, వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఫోన్ ద్వారా సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ విద్య, వైద్యం, స్థానిక సమస్యలు, ఇతర అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు ఎవరి సిఫార్సు లేకుండా నేరుగా తనను కలవాలన్నారు.



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

అర్చకుల వంశ పారంపర్య హక్కు నమోదు

కర్నూలు కల్చరల్: జిల్లాలోని దేవదాయ ధర్మదాయ శాఖ పరిధిలోని 6సీ దేవాలయాల్లో పనిచేస్తున్న అర్చకులు వంశపారంపర్య హక్కు నిర్ధారణకు పేర్లు నమోదు చేసుకోవాలని దేవదాయ శాఖ సహాయ కమిషనర్ ఎం. రామాంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఈవో పరిధిలోని దేవాలయాల్లో పనిచేస్తున్న అర్చకులు తమ దరఖాస్తులను ఐదు రోజుల్లోగా ఏసీ కార్యాలయంలో అందజేయాని సూచించారు.

అర్హులందరికీ వ్యాక్సిన్ ఇప్పించాలి



బాలికను పరిశీలిస్తున్న డీఐఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అర్హులైన పిల్లలందరికీ వ్యాక్సిన్ ఇప్పించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ సూచించారు. బుధవారం స్థానిక బి.తాండ్రపాడులోని సచివాలయం పరిధిలో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. గర్భిణులకు, పిల్లలకు సంబంధించి వ్యాక్సినేషన్ రికార్డులు, వ్యాక్సిన్‌లు నిల్వ ఉండే శీతలీకరణ పరికరాలను పరిశీలించారు. ఏఎన్ఎంలు తమ పరిధిలోని అర్హులైన చిన్నపిల్లలందరికీ సమయానుసారంగా వ్యాక్సిన్‌లు ఇవ్వాలని, ముఖ్యంగా టీడీ, రోటా, ఎంఆర్ వ్యాక్సిన్‌లు పూర్తి చేయాలని సూచించారు. గర్భిణులకు కాన్పుకు వెళ్లాల్సిన ఆసుపత్రిని ముందుగానే గుర్తించి ఆ వివరాలను ఎంసీపీ కార్డు, ఏఎన్ఎం యాప్, ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఎన్‌సీడీ సర్వేలో భాగంగా ప్రతి ఏఎన్ఎం రోజుకు కనీసం ఐదు ఐడీలు జనరేట్ చేయాలన్నారు. మాతాశిశు ఆరోగ్యభద్రతలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సమన్వయంతో కిల్కారి ఆరోగ్యసేవలను మొబైల్ వాయిస్ కాల్ ద్వారా ఇస్తున్నట్లు చెప్పారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి మెనూను, రికార్డులను పరిశీలించారు. మాతాశిశు సేవలపై తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబిలైజర్ ప్రసాద్, ఎంపీహెచ్ఎస్ మంగమ్మ, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తుంగభద్రలో ఘనంగా పునఃప్రతిష్ఠ వేడుకలు



కలశాలకు హారతి ఇస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం రూరల్: మండలంలోని తుంగభద్ర గ్రామంలో రాఘవేంద్రస్వామి మృత్తిక బృందావనం పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పీఠాధిపతి సుబుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో బుధవారం వైభవంగా నిర్వహించారు. రూ.40 లక్షలతో రాఘవేంద్రస్వామి మఠాన్ని పునర్నిర్మించారు. పండితుల వేదమంత్రోచ్చారణల మధ్య పూజలు చేపట్టారు. అనంతరం నిర్మాణ శిలాఫలకాన్ని ప్రారంభించారు. మఠంలోనే సంస్థాన పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యేను పీఠాధిపతి శాలువా, ఫలమంత్రాక్షితలు, మెమెంటో ఇచ్చి ఆశీర్వదించారు. మఠం మేనేజర్ వెంకటేశ్ జోషి, విశ్రాంత అధికారులు ఈఈ సురేష్, విద్యాపీఠం ప్రిన్సిపాల్ వాదీంద్రాచార్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని రూరల్ : మండలంలోని పెద్దతుంబళం గ్రామ శివారులో గ్రామానికి చెందిన బోయ రాజేష్ అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తుండగా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సెబ్ సీఐ హరికృష్ణ బుధవారం తెలిపారు. రాజేష్ వ్యక్తి మోటార్ సైకిల్‌పై ఐదు కర్ణాటక మద్యం బాక్సులు రవాణా చేస్తుండగా దాడి చేసి మద్యంను స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. ఏఈఎస్ రాజశేఖర్‌గౌడ్, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య



మృతి చెందిన ఆలిబీ

ఓర్వకల్లు: ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యల కారణంగా ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పింజరి దస్తగిరి, భార్య ఆలిబి(51) తమకున్న మూడు ఎకరాలతో పాటు ఇతరుల పొలాలను కౌలుకు తీసుకొని పంటలు సాగు చేసుకునే వారు. కుటుంబ ఖర్చులకు, పంటల పెట్టుబడికి రూ.60 లక్షల దాకా అప్పులు చేశారు. ఈ అప్పులు తీర్చలేక కొద్ది రోజుల నుంచి ఆలిబి మనస్తానికి గురయ్యారు. బుధవారం ఉదయం పొలానికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లింది. కుటుంబ సభ్యులు అనుమానంతో అక్కడికి వెళ్లి చూడగా తాడుతో వేపచెట్టుకు ఉరేసుకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తల్లి ఖాజమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

గృహ హింస కేసులో రెండేళ్ల జైలు

ఆదోనిరూరల్:మండలంలోని విరుపాపురం గ్రామానికి చెందిన జి.మల్లికార్జునపై గృహ హింస కేసు నేరం రుజువు కావడంతో రెండు సంవత్సరాల సాధారణ జైలుశిక్ష,రూ.10 వేలు జరిమానా విధిస్తూ ఆదోని సెకండ్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వీరవెంకట నాగలక్ష్మి తీర్పునిచ్చారని ఆదోని తాలూకా ఎస్ఐ గోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం కేసు పూర్వాపరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ ముద్దాయికి జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చినట్లు చెప్పారు. ఆదోని తాలూకా పోలీస్‌స్టేషన్‌లో జి.మల్లికార్జునపై 2013లో కేసు నమోదు కాగా తుది తీర్పులో శిక్ష విధించారని పేర్కొన్నారు.

సమష్టిగా పనిచేద్దాం



పార్టీలో చేరిన వారితో కలిసి వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎస్వీ మోహన్‌రెడ్డి దంపతులు

కర్నూలు(రాజ్‌విహార్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకునేందుకు సమష్టిగా పనిచేయాలని కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. నగరంలోని 49వ వార్డుకు చెందిన కల్లా నరసింహారెడ్డి, కల్లా నాగవేణితో పాటు పలువురు బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ముందుగా వైఎస్ఆర్ సర్కిల్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నరసింహారెడ్డి, నాగవేణి తదితరులకు ఎస్వీ దంపతులు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ నాయకురాలు విజయ మనోహరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మలాల జన్మదిన వేడుకలు

కర్నూలు(రూరల్): నగరంలోని బీ క్యాంప్ వసతి గృహంలో మలాల జన్మదిన వేడుకలను డీవైఎఫ్ఐ, ఐద్వా, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 'నూతన విద్యా విధానం - విద్యార్థినులపై ప్రభావం' అంశంపై సెమినార్ ఏర్పాటు చేశారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ మాట్లాడుతూ బాలికల విద్య కోసం తుపాకీ తూటాలకు ఎదురొడ్డిన మలాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డెన్ శిరీష, అధ్యాపకుడు అక్తర్‌బాషా, ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలు, ఎస్ఎఫ్ఐ నాయకులు సాయి ఉదయ్, అమర్, నరసింహ, యోగి తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయండి



బిర్లా సర్కిల్ వద్ద పనుల గురించి అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): నగరంలో చేపడుతున్న జగనన్న నగర బాట, స్మార్ట్ సిటీ పనులు మరింత వేగవంతం చేయాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశించారు. బుధవారం స్థానిక బిర్లా సర్కిల్ వద్ద అభివృద్ధి పనులను పరిశీలించారు. మున్సిపల్ ఈఈ షాకీర్ హుస్సేన్‌ను పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. బిర్లా గడ్డ వద్ద స్మార్ట్‌స్ట్రీట్ పేరుతో సమాంతర మురుగు కాల్వ, నడక దారి అభివృద్ధి చేయనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఆయన వెంట డీఈఈ నరేష్, ఏఈ రసూల్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఉషూ పోటీలకు కర్నూలు విద్యార్థి



విద్యార్థి ఆకాష్

కర్నూలు(రూరల్): శ్రీకాకుళంలో ఈనెల 15, 16 తేదీలలో జరగనున్న రాష్ట్ర స్థాయి ఉషూ పోటీలకు తమ స్కూల్ విద్యార్థి ఆకాష్ ఎంపికయ్యాడని అథెనా స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయిలోనూ ప్రతిభ కనపరచాలని ఆమె ఆకాక్షించారు.

బీసీ గురుకులాల్లో సీట్లు పెంచాలి

కర్నూలు(అర్బన్): మహాత్మా జ్యోతిరావు పూలే గురుకులాల్లో సీట్లు పెంచాలని బీసీ విద్యార్థి, యువజన సంఘం జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ కోరారు. బుధవారం ఆయన బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి కొత్తకోట మోహన్‌తో కలిసి విజయవాడలోని బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.అనంతరామ్‌కు వినతి పత్రం అందించారు.

తెలుగుగంగ పరిసరాల్లో చిరుత సంచారం

మహానంది: బండిఆత్మకూరు – మహానంది తెలుగు గంగ కాలువ రోడ్డులో కట్ట వద్ద బుధవారం సాయంత్రం చిరుతపులి కనిపించింది. దీంతో రైతులు భయాందోళనకు గురయ్యారు. నీటిని తాగేందుకే చిరుత అడవిదాటి కాలువ వద్దకు వచ్చినట్లు స్థానికులు తెలిపారు. చిరుత మళ్లీ అడవిలోకి వెళ్లినట్లు ఎఫ్‌ఆర్‌ఓ నాసిర్‌ఝా తెలిపారు.

అన్నదమ్ముల ఘర్షణలో ఒకరికి గాయాలు

కోసిగి: మండలంలోని గొడుగల్లు గ్రామంలో అన్నదమ్ముల ఘర్షణలో మారెన్న అనే వ్యక్తికి తీవ్ర రక్త గాయమైంది. పొలాలకు సంబంధించిన తగదాలతో ఘర్షణ చోటుచేసుకోగా తన అన్న ఇనుప రాడ్డుతో దాడి చేశారని బాధితుడు మారెన్న వాపోయాడు. రక్త గాయంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స చేయించుకున్నారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

దగ్గరి వారు కూడా దరికి రాని వేళలో..



ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పల్లె తిమ్మన్నకు పెన్షన్ ఇస్తున్న వలంటీర్ మాధవి

అది 2020 సంవత్సరం. కర్నూలు నగరం కరోనాతో తల్లడిల్లుతున్న వేళ. 30 వార్డులకు పైగా రెడ్ జోన్ ప్రకటించారు. ఎవరూ ఇంటిలో నుంచి బయటకు రాని పరిస్థితి. ఎవరు ఎలాపోతేనేం తాను బతికితే చాలనుకునే రోజులు. అలాంటి స్థితిలోనూ వలంటీర్లు సేవలందించారు. అందులో నాలుగవ తరగతి ఉద్యోగుల కాలనీకి చెందిన వలంటీర్ కుమ్మరి మాధవీ ఒకరు. ప్రాణాలను అరిచేతిలో పెట్టుకుని, చేతులకు గ్లౌజులు, ముఖానికి మాస్క్, మెడలో గుర్తింపు కార్డుతో బయలుదేరి తన పరిధిలోని ప్రజల బాగోగులు తెలుసుకునేది. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పల్లె తిమ్మన్నకు సైతం పింఛన్ అందజేసింది. కరోనా సమయంలో తన వారెవరూ రాకున్నా.. ఆసుపత్రికి వచ్చి పింఛన్ ఇచ్చిన వలంటీర్‌కు ఆయన రెండుచేతులు జోడించి నమస్కరించాడు.

ఆశ్చర్యమేసింది



సార్... నిజంగా కరోనా సమయంలో పెన్షన్ ఇవ్వరనుకున్నా. ఇంట్లో వాళ్లనే రానివ్వడం లేదు. అలాంటి పరిస్థితుల్లో మా వలంటీర్ మాధవి ఆస్పత్రికి వచ్చి పెన్షన్ ఇవ్వడంతో నాకు ఆశ్చర్యమేసింది. ప్రాణాలకు సైతం తెగించి నాకు సాయం చేసింది. ఆమె మేలు జీవితంలో మరిచిపోలేను.

– పల్లె తిమ్మన్న, పెన్షన్ దారుడు

గులాం రసూల్ ఖాన్‌కు ఘన నివాళి



రసూల్ ఖాన్ చిత్ర పటం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న కవులు, రచయితలు

కర్నూలు కల్చరల్: ఇంటెలెక్చువల్ కలెక్టివ్స్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో కర్నూలు చివరి నవాబు గులాం రసూల్ ఖాన్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. రసూల్‌ఖాన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ బ్రిటీష్ పాలకులపై అలుపెరగని పోరాటం చేసి అమరుడైన రసూల్ ఖాన్ జీవితాన్ని యువతరానికి, విద్యార్థులకు పరిచయం చేస్తేనే వారిలో దేశ భక్తిని రగిలించిన వాళ్లమవుతామన్నారు. సంస్థ అధ్యక్షులు ఖదీరుల్లా, కార్యదర్శి ఇనాయతుల్లా, కవులు వెంకటకృష్ణ, మారుతి, అజీజ్, పట్నం రాజేశ్వరి, నాగేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ మహా సభ పోస్టర్ల ఆవిష్కరణ

విజయవాడ బెంజి సర్కిల్‌లో ఈనెల 16న నిర్వహించనున్న గ్రంథాలయ మహా సభ పోస్టర్లను కవులు,రచయితలు జి.వెంకటకృష్ణ, పాణి, నాగేశ్వరాచారి, ఏపీ రెడ్డి, ఇనాయతుల్లా, మారుతి తదితరులు ఆవిష్కరించారు. బుధవారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మరో గ్రంథాలయ ఉద్యమంలో భాగంగా సభ జరుగుతుందన్నారు. పాఠకుల్లో పుస్తక పఠనాశక్తిని పెంచడం ముఖ్య ఉద్దేశమన్నారు.

ఇటుక బట్టీ యజమానికి జరిమానా

కర్నూలు (న్యూసిటీ): కల్లూరు మండలం ఉల్లిందకొండ సమీపంలోని కొల్లంపల్లి తండా వద్ద ఉన్న ఇటుక బట్టీ యజమానికి రూ.2లక్షల జరిమానా విధించినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. ఇటువల బట్టీ వల్ల పంటలు నాశనమవుతున్నాయని, క్వారీలో జరుగుతున్న పేలుళ్ల వల్ల ఇళ్లు దెబ్బతింటున్నాయని గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయన బుధవారం అక్కడికి వెళ్లి విచారించారు. ఇటుకల తరలింపు సమయంలో వాహనాలు పొలాల్లో వెళ్లడంతో పంటలు నాశనవుతున్నాయని గ్రామస్తులు ఆయన దృష్టికి తెచ్చారు. కంకర క్వారీలో జరుగుతున్న బ్లాస్టింగ్ వల్ల ఇళ్లు నెర్రెలు ఇస్తున్నాయని ఫిర్యాదు చేశారు. స్పందించిన డీడీ లైసెన్స్ లేకుండా ఇటుక బట్టీ నిర్వహిస్తున్న యజమానిపై రూ.2 లక్షలు జరిమానా విధించారు. క్వారీలో శబ్దం రాకుండా కంట్రోల్ బ్లాస్టింగ్ వాడాలని, మరోసారి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై కేసు



స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడిన మైనర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ నాగభూషణం

కర్నూలు: మైనర్లకు వాహనాలిస్తే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం హెచ్చరించారు. నగరంలోని రాజ్‌విహార్, సి.క్యాంప్, ఓల్డ్ ఈద్గా, ఫైవ్ రోడ్ జంక్షన్లలో బుధవారం వాహన తనిఖీలు నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ట్రిబుల్ రైడింగ్ చేస్తున్న 25 మంది మైనర్లను అదుపులోకి తీసుకుని వాహనాలను సీజ్ చేసి కొత్తపేటలోని ట్రాఫిక్ స్టేషన్‌కు తరలించారు. ట్రాఫిక్ నిబంధన ఉల్లంఘన కింద కేసులు నమోదు చేసి రూ.50,875 జరిమానా విధించారు. సాయంత్రం వారి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి ట్రాఫిక్ డీఎస్పీ కౌన్సెలింగ్ ఇచ్చారు.

రూ.38లక్షల విలువైన విత్తనాల అమ్మకాల నిలిపివేత



విత్తన దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఆర్‌సీ ఏడీఏ వేదమణి, ఏఓలు

కోడుమూరు రూరల్: విత్తనాల దుకాణాల్లో బుధవారం డీఆర్‌సీ ఏడీఏ వేదమణి, ఏఓలు రవిప్రకాష్, హేమలత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విత్తనాలకు సంబంధించి కిరణ్ హైబ్రిడ్స్, విశ్వజిత్ ట్రేడర్స్, కిసాన్‌మాల్, రాఘవేంద్ర సీడ్స్ దుకాణాల్లో సరైన రికార్డులు లేకపోవడంతో రూ.38లక్షలు విలువ చేసే విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేశారు. ఏడీఏ మాట్లాడుతూ ప్రతి దుకాణదారుడు విత్తనాలు, ఎరువులు, మందులకు సంబంధించిన స్టాక్ రిజిష్టర్లతో పాటు,రికార్డులను కలిగివుండాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు.

12వ పీఆర్‌సీ ఏర్పాటుపై హర్షం

కర్నూలు సిటీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని 12వ పీఆర్‌సీని ఏర్పాటు చేయడంపై ఏపీ కాంట్రాక్ట్ లెక్చరర్స్ జేఏసీ ఆర్థిక కార్యదర్శి ఎస్.అబ్దుల్ జబ్బర్ బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. 12వ పీఆర్‌సీ చైర్మన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ డాక్టర్ మన్‌మోహన్‌సింగ్‌ను నియమించడం పట్ల తాము సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

మాతృసంస్థకు డీసీ రమాదేవి

కర్నూలు (టౌన్): నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమాదేవి మాతృ సంస్థకు బదిలీ అయ్యారు. ఏపీ సచివాలయంలో కార్యదర్శిగా పనిచేస్తున్న ఆమె గత ఏడాది జూన్ 30న డిప్యుటేషన్‌పై నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఏడాది కాలం ముగియడంతో డిప్యుటేషన్‌ను రద్దు చేసి, ఏపీ సచివాలయం సాధారణ పరిపాలన శాఖలో రిపోర్టు చేయాలని బుధవారం ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వై.శ్రీలక్ష్మి జీఓ 436 జారీ చేశారు.